

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.


ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888


Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -134 | పేజీలు - 8 | వెల ₹03/- | సోమవారం 31 ఆగస్టు 2026

మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..



నేడు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం



- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు

అమరావతి,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, **మిగతాది 2లో...**

ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

- 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్
- 30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు
- తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు
- ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని

న్యూఢిల్లీ,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.



ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన **మిగతాది 2లో...**

దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

- జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ
- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్



న్యూఢిల్లీ,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష **మిగతాది 2లో...**



మరో జల ప్రళయం..?

నేపాల్‌లో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- హిమానీనదం విస్ఫోటనం తర్వాత మరో సంక్షోభంతో నేపాల్ ఆందోళన

అమరావతి,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత **మిగతాది 2లో...**

77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు





మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

- ఇంటికో పండ్ల మొక్క..ఆరోగ్యానికి బంగారు బాట- వనమహోత్సవ పురోగతి సమీక్షలో మంత్రి సీతక్క



మాజీ మంత్రి ధర్మాన పై కేసు

- బలవంతంగా గృహ ప్రవేశాలు చేయించారని ఆరోపణ
- ధర్మానతో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు
- గృహనిర్మాణ శాఖ డీఈఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- హుద్‌హుద్ బాధితుల ఇళ్ల పంపిణీలో వివాదం

అమరావతిఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గృహ ప్రవేశాలు చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం **మిగతాది 2లో...**

హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

- రూ.500 కోట్ల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర
- ఉపసంహరించుకోవాలని
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ



నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు



ప్రచారం కోసమే జగన్పై నిందలు

విజయసాయిపై సజ్జల ఫైర్

అమరావతి,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)
వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయసాయి రెడ్డి విమర్శలపై తీవ్రంగాస్పందించారు. విజయసాయిని జగన్ గతంలోఎంతో అభిమానించారని, ఇప్పుడు సొంత రాజకీయాల కోసం, ప్రచారం కోసం జగన్‌ను, వైసీపీనిఆయన విమర్శించడం సరికాదని అన్నారు. విజయసాయి రెడ్డి సొంతంగా రాజకీయాలు చేసుకోవచ్చని, అయితే తమను టార్గెట్ చేస్తే మాత్రం గట్టిగాస్పందిస్తామని సజ్జల హెచ్చరించారు. విజయసాయి **మిగతాది 2లో...**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

మరో జల ప్రళయం..?

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది.టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది.

"భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది.

కొద్దిసేపటికే ఎన్‌డీఆర్ఆర్ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

మాజీ మంత్రి ధర్మాన పై కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయనతో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహనిర్మాణ శాఖ శ్రీకాకుళం డీఈఈ వి.వి. సత్యాజీ అందజేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరణం సురేశ్ వెల్లడించారు. గతంలో హుద్‌హుద్ తుపాను బాధితులైన మత్స్యకార కుటుంబాల కోసం ప్రభుత్వం గృహాలను నిర్మించింది. పంపిణీ సమయంలో కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఇళ్లను ఖాళీగా ఉంచారు.

ఈ నేపథ్యంలో తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ వైసీపీకి చెందిన కొందరు మత్స్యకారులు గతంలో కలెక్టరుకు విన్నవించుకున్నారు. అయితే, గత మే 14వ తేదీన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డీఈఈ ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేశ్ వివరించారు. ఈ పరిణామం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది

ప్రచారం కోసమే జగన్పై నిందలు


(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలను ఇకపై పట్టించుకోబోమని,పార్టీ నేతలు కూడా వాటికిప్రాధాన్యం ఇవ్వొద్దనిసూచించారు. జగన్ నాయకత్వాన్ని లక్ష్యంగాచేసుకుని వ్యక్తిత్వ హననం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందిజగనేనని, వైసీపీకి సుదీర్ఘకాలం నాయకత్వంవహించే సత్తా ఆయనకే ఉందన్నారు. పార్టీని వీడినవారి గురించి జగన్ ఎప్పుడూ ప్రతికూలంగామాట్లాడలేదనిచెప్పారు. జగన్ మతమార్పిడులనుప్రోత్సహించారని విజయసాయి చేసిన ఆరోపణలుదారుణమని సజ్జల మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే జగన్, వైసీపీపైవిమర్శలు చేస్తున్నారని, విజయసాయి పబ్లిసిటీకోసమే ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు

ఖాట్మండ్ ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)



నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన ముప్పునకు మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆకస్మిక వరదలతో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం.. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌బిలో 194, నవల్పరాసి వెస్ట్‌బిలో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌బిలో 52, ధాడింగ్‌బిలో 50, తున హున్‌బిలో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పో యారు. కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారనీ, అందులో నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ పేర్కొంది. గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆస్పత్రులలో భద్రపరిచినట్టు వివరిం చింది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆస్ప త్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాం తాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొ చ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్ట లేనంతగా ఛిద్రమైన మృత దేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్య క్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి.

దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ పకటించింది.

దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది.పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది.

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అబ్జైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది.

పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.



వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం..

హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు,



సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

హైదరాబాద్,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)

హైదరాబాద్‌లోని అజామాబాద్ పారిశ్రామిక వాడలో గల రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాన్ని విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న భూమిని సదరు సంస్థకు కాకుండా ఇతరులకు అప్పనంగా ధారాదత్తం చేసేందు కు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో వందల కోట్ల విలువ గల భూమిని కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుయాయులకు తక్కువ ధరకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా, వారిని కాదని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక దాగిన కుట్రను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు. 1987లోనే సుప్రీంకోర్టు ప్రయివేట్ సంస్థకు మొట్టికా యలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారని లేఖలో పేర్కొన్నారు. ఒక్క అజామాబాద్ అనే కాకుండా కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందా నడిపిస్తోందని ఆరోపించారు. స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్‌లో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొత్తును ప్రయివేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు

హైదరాబాద్,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఢిల్లీ వెళ్తున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్తారని సీఎం కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇది 77వ సారి. సీఎం వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార, మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వెళ్తారని చెప్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో వీరు చర్చిస్తారని తెలిసిందిమంత్రివర్గ విస్తరణ మీద చర్చలు జరుగుతాయని సీఎంవో కార్యాలయం లీకులు వదిలింది. దీనిని అధికారిక పర్యటనగా చెప్పుకొనేందుకు రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదల అంశాలపై సీఎం పలువురు కేం ద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు సమయం కోరినట్టు చెప్తున్నారు

మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

హైదరాబాద్,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, పచ్చని రాష్ట్రంతో పాటు ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టిన వనమహోత్సవ పురోగతిపై ఆదివారం సమీక్షించారు. కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి జిల్లాల వారీగా మొక్కలు నాటడం, ఇంటి ఆవరణల్లో మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీంతో లక్ష్యంలో 91 శాతం మేర మొక్కల నాటడం పూర్తయిందని తెలిపారు. గుంతల తవ్వకంలో కూడా 92 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు. జిల్లాల పనితీరును సమీక్షించిన మంత్రి సీతక్క, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అధికారులు చూపుతున్న చొరవపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు.నాటిన ప్రతి మొక్క బతికి ఎదగడమే వనమహోత్సవం అసలు విజయమని అన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం, మనుగడను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణల్లో నాటేందుకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పండ్ల మొక్కలను ప్రతి కుటుంబానికి చేరవేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క పెంచడం అంటే కేవలం పచ్చదనం పెంచడం మాత్రమే కాదు.. కుటుంబ ఆరోగ్యానికి పెట్టుబడి పెట్టడం కూడా అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి పండ్ల మొక్కలను ఇంటి వద్ద పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు తాజా, సహజమైన పోషకాహారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క, ప్రతి గ్రామంలో విస్తారమైన పచ్చదనం ఉండేలా ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

అమృతమూర్తికి ఘన నివాళులు

- పల్లె ఉమా జ్ఞాపకాలు పదిలం
- మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
- ఆమె లేని లోటు ఎవరూ తీర్చలేరు
- వర్ధంతి సందర్భంగా పల్లె భావోద్వేగం







అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 30,(రిపబ్లిక్ న్యూస్):
పల్లె ఉమా జ్ఞాపకాలు పదిలమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆమె లేని లోటు ఎవరూ తీర్చలేదని కన్నీటిపర్యంత మయ్యారు. తన జీవితంలో అర్ధభాగంగా నిలిచి, కుటుంబానికి అండగా ఉంటూనే విద్యారంగంలోనూ, సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేసిన సతీమణి పల్లె ఉమా జ్ఞాపకాలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నెమరువేసుకున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సేవామూర్తి, అమృతమూర్తి దివంగత పల్లె ఉమా 8వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమం జనసంద్రంగా మారింది. మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి, మనుమడు వియాన్, మనుమరాలు వన్నూ, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి తదితర కుటుంబ సభ్యులు ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి అశ్రు నివాళులర్పించారు.

నాణ్యమైన విద్య అందించాలన్నదే పల్లె ఉమా లక్ష్యం

ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమా తన జీవితంలో భార్యగా మాత్రమే కాకుండా కుటుంబానికి పెద్దదిక్కుగా, విద్యార్థులకు ఆప్యాయతను పంచిన విద్యావేత్తగా, పేదలకు చేయూతనందించిన మానవతావాదిగా, తన రాజకీయ ప్రయాణంలో ప్రతి అడుగులోనూ వెన్నుదన్నుగా నిలిచిన సహచరిగా కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయని, ఆమె ఆశయాలను కుటుంబ సభ్యులంతా కలిసి కొనసాగిస్తామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నదే పల్లె ఉమా ప్రధాన లక్ష్యంగా ఉండేదని తెలిపారు. విద్య ద్వారా మాత్రమే వెనుకబడిన కుటుంబాల భవిష్యత్తును మార్చగలమని ఆమె బలంగా విశ్వసించేవారని గుర్తుచేశారు. రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల్లో విద్యాసంస్థలను నెలకొల్పి స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఆమె ఎంతో శ్రమించారని చెప్పారు.

ఆమె అందించిన సేవలు ఎన్నటికీ మరువలేం

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో విద్యార్థులకు 25 శాతం వరకు రాయితీలు కల్పించి అండగా నిలిచారని రఘునాథరెడ్డి తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించి వారి చదువుకు చేయూతనందించేవారని చెప్పారు. జిల్లాలో 67 విద్యాసంస్థల స్థాపనకు పల్లె ఉమా కృషి చేశారని రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బాలాజీ ఎడ్యుకేషన్ విద్యాసంస్థల నిర్మాణం, అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాయలసీమ ప్రాంత విద్యార్థులకు ఆమె అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఆమె చేసిన కృషి అనేక కుటుంబాలకు మేలు చేసిందన్నారు.

పల్లె ఉమా ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేను

పల్లె ఉమా వంటి వ్యక్తులు శతాబ్దానికి ఒకసారి మాత్రమే పుడతారని రఘునాథరెడ్డి భావోద్వేగంతో అన్నారు. అలాంటి వ్యక్తికి భర్తగా ఉండటం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ఆమె తన జీవితంలో అందించిన ప్రేమ, ఆప్యాయత, ప్రోత్సాహం, సహకారం ఎప్పటికీ మరువలేనన్నారు. భార్యగా, కుటుంబ సభ్యురాలిగా, విద్యావేత్తగా, మానవతావాదిగా ఆమె పోషించిన పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.
పల్లె ఉమా లేని లోటు ఎవరూ తీర్చలేరని రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా తమ మధ్య లేకపోయినా.. ఆమె జ్ఞాపకాలు, ఆశయాలు, సేవా కార్యక్రమాలు తమతోనే ఉంటాయని తెలిపారు. కుటుంబాన్ని ప్రేమతో చూసిన తీరు, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత, పేదల పట్ల కలిగిన మానవతా దృక్పథం తమకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు.ఆమె తమపై ఉంచిన బాధ్యతలను కుటుంబ సభ్యులంతా కలిసి పూర్తి చేస్తామని రఘునాథరెడ్డి తెలిపారు.

పల్లె ఉమా అభిమానులు గుండెల్లో చెరగని ముద్ర

పల్లె ఉమాకు నివాళులర్పించేందుకు పుట్టపర్తి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటప్రసాద్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ తదితరులు హాజరై నివాళులర్పించారు. టీడీపీ, బీజేపీ, జనసేనతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాల పంపిణీ

పల్లె ఉమా వర్ధంతిని పురస్కరించుకుని పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానం, నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు అన్నవితరణ చేశారు. పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను కుటుంబ సభ్యులు అందజేశారు.
పల్లె ఉమా భౌతికంగా తమ మధ్య లేకపోయినా ఆమె చేసిన సేవలు, చూపిన ఆత్మీయత, పేదల పట్ల ఆమెకున్న మానవతా దృక్పథం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి వేలాది మంది అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.







పరిటాల రవి ఓ చరిత్ర

- ఆయన ఆశయాలు కొనసాగిస్తాం
- ఘనంగా 68వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు..



అనంతపురం/రామగిరి, ఆగస్టు 30,(రిపబ్లిక్ న్యూస్):
పరిటాల రవీంద్ర (రవి) ఓ పేరు కాదని.. ఓ చరిత్ర అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పరిటాల రవీంద్ర 68వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా అనంతపురం జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘన నివాళులు అర్పించిన పరిటాల అభిమానులు

తొలుత పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కుటుంబ సభ్యులతో కలిసి ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు, పరిటాల అభిమానులు పెద్ద సంఖ్యలో ఘాట్ వద్ద నివాళులర్పించారు. దీంతో వెంకటాపురం పరిసరాలు అభిమానుల సందడితో నిండిపోయాయి. అనంతరం పరిటాల సునీత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపట్టారు.

బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన పరిటాల

ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవీంద్ర తన రాజకీయ ప్రస్థానంలో పేదలు, బడుగు వర్గాల పక్షాన నిలిచారని పేర్కొన్నారు. అనేక పోరాటాల



ద్వారా ప్రజలకు అండగా నిలిచిన ఆయన.. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కూడా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదరణ పొందారని గుర్తు చేశారు. ఆయనపై ప్రజల్లో ఏర్పడిన అభిమానం, నమ్మకం ఇప్పటికీ కొనసాగు తోందన్నారు.

శాశ్వతంగా నీరు అందించాలన్నది పరిటాల రవీంద్ర లక్ష్యం

పేరూరు జలాశయానికి శాశ్వతంగా నీరు అందించాలన్నది పరిటాల రవీంద్ర ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పరిటాల సునీత తెలిపారు. ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని.. త్వరలోనే సాకారం చేస్తామని పేర్కొన్నారు. రవి ఆశయ సాధన కోసం పరిటాల శ్రీరామ్ నిరంతరం పనిచేస్తారని స్పష్టం చేశారు.

తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా

రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం ప్రాంతాలంటే పరిటాల రవీంద్రకు ఎంతో ఇష్టమని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయనపై ప్రజలు, అభిమానులు చూపిన ప్రేమనే నేటికీ





తమపై చూపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా పనిచేస్తామని తెలిపారు. పరిటాల రవీంద్ర ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు.

శిల్పారామం హెలిప్యాడ్‌కు సీఎం చంద్రబాబు

ఘన స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు



అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్):
అనంతపురం నగర సమీపంలోని శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుకున్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఐజీ షిమోషి బాజ్పేయి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీశ్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్ర, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, ఎం.ఎస్.రాజు తదితరులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, జేసీ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్‌కుమార్‌తో పాటు రాష్ట్ర కార్మిక బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ బల్లా పల్లవి, ఏపీ వీరశైవ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న, ఎడిసీసీ చైర్మన్ కేశవరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా ప్రసాద్, డీసీసీ చైర్మన్, పరిటాల శ్రీరామ్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు సీఎంను కలిసి స్వాగతం తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు రోడ్డు మార్గంలో అనంతపురం నగరంలోని ఎంవైఆర్ కళ్యాణ మండపానికి బయలుదేరారు. అక్కడ జరుగుతున్న గుంతకల్లు ఎమ్మెల్యే కుమార్తె, ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు హెలిప్యాడ్ నుంచి వివాహ వేదిక వరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఇంటి దొంగతనం కేసులో నలుగురు అరెస్ట్

సీసీటీవీ ఆధారంగా నిందితుల గుర్తింపు.. 25 గ్రాముల బంగారం, 320 గ్రాముల వెండి స్వాధీనం



కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 30)

ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన కేసులో నాలుగవ పట్టణ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 25 గ్రాముల బంగారు ఆభరణాలు, 320 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు దొంగతనానికి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.నాలుగవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్, ఉల్చాల రోడ్డులో నివాసం ఉంటున్న జయంతి మహేశ్వర్‌రెడ్డి ఇంట్లో జూలై 6న దొంగతనం జరిగింది. ఇంటికి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు సుమారు 25 గ్రాముల బంగారు నగలు, 320 గ్రాముల వెండి ఆభరణాలను అపహరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఫుటేజీల్లో అనుమానాస్పదంగా కనిపించిన స్కూటీని గుర్తించి, దాని ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా పెట్టారు.ఈ క్రమంలో సమ్మర్ స్టోరేజ్ సమీపంలోని పొలాల్లో దాక్కొని ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తాడిపత్రి టౌన్‌కు చెందిన ఎరుకలి గంగా ప్రసాద్ (38), ఎరుకలి శివప్రసాద్ (48), కర్నూలు ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కామ్లే కార్తిక్ (32), పామిడికి చెందిన ఎరుకలి రామాంజనేయులు (43)గా గుర్తించారు.నిందితుల వద్ద నుంచి రెండు బంగారు చైన్లు, చిన్నపిల్లల ఉంగరాలు కలిపి సుమారు 2.5 తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగతనానికి ఉపయోగించిన స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు.సీఐ విక్రమ్ సింహ అధ్యక్షతన ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు సుబ్బారాయుడు, మురళి, జీనస్, ఈశ్వర్, గోవింద్ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నీట్ పీజీ పరీక్ష కేంద్రాల్లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీలు

భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి.. పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచన





కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 30)

నీట్ పీజీ పరీక్ష సందర్భంగా కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను ఆయన స్వయంగా పరిశీలించారు.

కర్నూలులోని డా. కె.వి. సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్ష కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు.పరీక్ష పూర్తయ్యే వరకు పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు.

ఈ తనిఖీల్లో కర్నూలు డీఎస్పీ రాఘవేంద్రతో పాటు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవితం పై విరక్తి కలిగి దంపతుల బలవన్మరణం

హంద్రీ కాలువలో దూకి విషాదాంతం





చిప్పగిరి, ఆగస్టు, 30, (రిపబ్లిక్ న్యూస్)

జీవితంపై విరక్తి కలిగి దంపతులు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన చిప్పగిరి మండలం, బెల్దోన గ్రామం లో చోటుచేసుకుంది. బెల్దోన గ్రామానికి చెందిన అవ్వగారి సోమలింగమ్మ, సీతన్న, దంపతులు ఆదివారం కసాపురం సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కొద్ది సేపు గాలించగా సోమలింగమ్మ శవాన్ని కాలువ నుండి బయటి తీశారు. సీతన్న కోసం గాలిస్తున్నారు. దంపతుల మృతితో బెల్దోన గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు, వివరాలు తెలియాల్సి ఉంది.

ఉద్యోగ సంఘాల భవిష్యత్ కార్యాచరణ.. 5న తేల్చనున్న ఏపీ జేఏసీ


విజయవాడ ప్రతినిధి, ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్):

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) తన భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలు సహా ఇతర డిమాండ్లపై చర్చించి, తదుపరి కార్యాచరణను ఖరారు చేయనున్నారు.

ఈ మేరకు ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలు, సంప్రదింపులకే తాము తొలి ప్రాధాన్యం ఇస్తామని, అవి విఫలమైతేనే ఉద్యమ కార్యాచరణ అనివార్యమని వారు స్పష్టం చేశారు. మంత్రుల బృందం ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణం నెలకొందని వారు పేర్కొన్నారు. అయితే, పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక బకాయిల చెల్లింపులో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రూ. 22 వేల కోట్ల బకాయిలు చెల్లించడం, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు పంపిణీ చేయడం, 11 వేల మందికి ఓపీఎస్ వర్తింపజేయడం, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అయినప్పటికీ, కీలకమైన ఆర్థిక అంశాలపై ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన కొరవడిందని జేఏసీ నేతలు అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 5న జరిగే సమావేశంలో వీటిపైనే ప్రధానంగా చర్చించి, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తదుపరి ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

కల్యాణ వేడుకకు సీఎం చంద్రబాబు

నూతన వధూవరులకు ఆశీస్సులు -కుటుంబ సభ్యులతో ఆత్మీయ పలకరింపు







అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 30,(రిపబ్లిక్ న్యూస్):

అనంతపురం నగరం ఆదివారం సందడిగా మారింది. గుంతకల్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహం, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడి వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి కి ఘనంగా స్వాగతం

వివాహ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేరుకోగానే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పూల నాగరాజు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రికి ఆత్మీయంగా అభివాదం చేశారు. అనంతరం వివాహ వేదిక వద్దకు చేరుకున్న చంద్రబాబు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు

వివాహ వేదికపై నూతన వధూవరులను కలిసిన ముఖ్యమంత్రి కొద్దిసేపు వారితో మాట్లాడారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి రాకతో వివాహ వేడుకకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రాక సందర్భంగా నిర్వాహకులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజాప్రతినిధుల సందడి

ఈ వివాహ వేడుకకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.


రెండు కుటుంబాల బంధువులు, సన్నిహితులు, ఆత్మీయులతో కళ్యాణమండపం సందడిగా కనిపించింది. వివాహ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు కుటుంబాల సభ్యులను పలకరించారు. గుమ్మనూరు జయరాం, పూల నాగరాజు కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. వివాహ వేడుకకు వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులతోనూ ముఖ్యమంత్రి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం కార్యక్రమాన్ని ముగించుకుని శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు బయలుదేరారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ పరిసరాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాక, తిరుగు ప్రయాణం వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

వినాయక ఘాట్‌కు సరికొత్త శోభ

ప్రత్యేక అభివృద్ధి, పారిశుద్ధ్య పనులతో ఆహ్లాదకరంగా మారిన పరిసరాలు

త్వరలో రంగులు వేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం: కమిషనర్ చల్లా ఓబులేసు







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 30)

నగరంలోని వినాయక ఘాట్ ప్రత్యేక అభివృద్ధి, పారిశుద్ధ్య పనులతో సరికొత్త శోభను సంతరించుకుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆయన వినాయక ఘాట్‌ను సందర్శించి ఇటీవల పూర్తిచేసిన సీసీ బండ్, మెట్లు, డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక ఘాట్‌ను వినాయక నిమజ్జన సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా పరిశుభ్రంగా, స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత మూడు నెలలుగా జేసీబీల సహాయంతో ఘాట్ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పలుమార్లు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.

ఘాట్ పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు ముగ్గురు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. వారు ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కేసీ కెనాల్‌లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కెనాల్‌లో చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రెండు చెత్త సేకరణ ట్రాలీలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఇటీవల కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలను సైతం తొలగించినట్లు కమిషనర్ వెల్లడించారు. చేపట్టిన నిరంతర పారిశుద్ధ్య చర్యలతో ప్రస్తుతం వినాయక ఘాట్ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తోందన్నారు.

అభివృద్ధి పనులతో కొత్త రూపు

ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వినాయక ఘాట్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా సీసీ రహదారి, మెట్లు, బండ్, రాతి నిర్మాణాలు, డ్రెయిన్, ఫెన్సింగ్ తదితర పనులను చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో ఘాట్‌కు నూతన శోభ వచ్చిందన్నారు. త్వరలోనే ఘాట్‌కు రంగులు వేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఘాట్ పరిశుభ్రతను కాపాడటంలో ప్రజలు కూడా నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఫరూక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక







విజయవాడ ప్రతినిధి, ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్):

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలని ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నిర్మాణ సభ పిలుపునిచ్చింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన యూనియన్ పునర్నిర్మాణ రాష్ట్ర స్థాయి సమావేశానికి ఏడు జిల్లాల అంగన్వాడీ ప్రతినిధులతో పాటు ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు హాజరయ్యారు.సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాదన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆర్.హరికృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.పోలారి, ఎం.వెంకటేశ్వర్లు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు జి.భారతి, ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి, నాయకులు ఎస్.కృష్ణవేణి, వి.శిరోమణి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బి.సోమయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

17 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీని ఏర్పాటు

సభ అనంతరం ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.భారతి, ప్రధాన కార్యదర్శిగా వి.ఆర్.జ్యోతి, గౌరవాధ్యక్షుడిగా ఆర్.హరికృష్ణ, న్యాయ సలహాదారుగా పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు, న్యాయవాది ఎం.లక్ష్మి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.పద్మ, వెంకటరత్న, కార్యదర్శులుగా ఎస్.కృష్ణవేణి, జె.గంగాదేవి, కె.విజయలక్ష్మి, కోశాధికారిగా వి.శిరోమణితో పాటు మరో 17 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు.


అంగన్వాడీల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమంపై సభలో పలు తీర్మానాలను ఆమోదించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా లేదా కార్మికులుగా గుర్తించి సంబంధిత చట్టాలు, సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంగా నెలకు రూ.30 వేలు చెల్లించాలని, అంగన్వాడీ వేతనాలను పీఆర్సీతో అనుసంధానం చేయాలని కోరారు.

అలాగే అంగన్వాడీలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, యాప్‌ల ద్వారా పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని, అర్హులైన ప్రతి అంగన్వాడీ ఉద్యోగికి ఇళ్ల స్థలం కల్పించాలని తీర్మానించారు. ఐవీఆర్ తరగతులను రద్దు చేయాలని కూడా సభ డిమాండ్ చేసింది. రాష్ట్రస్థాయిలో ఏర్పడిన నూతన కమిటీ స్ఫూర్తితో జిల్లాల్లో ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నాయకత్వం పిలుపునిచ్చింది.

పలు వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజేంద్రారెడ్డి









ఆళ్లగడ్డ ఆగస్టు 30 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆళ్లగడ్డ మండలం జి జంబూలదిన్నే గ్రామ వాస్తవ్యులు చిన్న గుర్రప్ప కుమారుని వివాహానికి హాజరైనారు. నంద్యాల పట్టణం లోని LKR పంక్షన్ హాల్ నందు రుద్రవరం మండలం యల్లావత్తుల గ్రామ వాస్తవ్యులు పార్వ పుల్లయ్య కుమార్తె వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సిరువెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామ వాస్తవ్యులు సిరిగిరి రామిరెడ్డి ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో గంగుల బ్రిజేంద్ర రెడ్డి వెంట ఆళ్లగడ్డ మండలధ్యక్షుడు గజ్జెల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలలో పాల్గొన్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి



ఆళ్లగడ్డ ఆగష్టు 30 రిపబ్లిక్ న్యూస్



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆళ్లగడ్డ తాలూకా దొర్నిపాడు మండలం లో శ్రీ వీర విజయ కల్యాణ మండపంలో జరిగిన జి జంబులదిన్నే గ్రామానికి చెందిన చిన్న గుర్రప్ప కుమారుడి వివాహానికి హాజరైనారు అనంతరం నంద్యాల మసీదుపురం మెట్ట సమీపంలో దీ9 పంక్షన్ హాల్లో జరిగిన నంద్యాల శివాజీ నగర్ కీ చెందిన పల్లె దిబ్బారెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిశీచి శుభాకాంక్షలు తెలియజేశారు.

కూకటికొండ అంగన్వాడీ కేంద్రంపై ఆరోపణలు అవాస్తవం

విచారణలో వాస్తవాలను పరిశీలించిన సీడీపీఓ మద్దమ్మ, సూపర్వైజర్ శివలింగమ్మ



దేవనకొండ, ఆగస్టు 30 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
దేవనకొండ మండలం కూకటికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదంటూ గతంలో వచ్చిన ఆరోపణలపై ఆస్పరి ప్రాజెక్టు సీడీపీఓ మద్దమ్మ, సూపర్వైజర్ శివలింగమ్మ విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు.. అంగన్వాడీ టీచర్, ఆయాతో వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ తమ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని సీడీపీఓ తెలిపారు.గతంలో వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని సీడీపీఓ మద్దమ్మ స్పష్టం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన సేవలను



సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు.

పల్లెదొడ్డిలో మారెమ్మ అవ్వ బోనాల ఉత్సవాలకు అనుమతి కోరిన గ్రామస్తులు

శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి: సీఐ వేణుగోపాల్



దేవనకొండ, ఆగస్టు 30 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-



పల్లెదొడ్డి గ్రామంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మారెమ్మ అవ్వ బోనాల ఉత్సవాలకు అనుమతి కోరుతూ గ్రామస్తులు ఆదివారం దేవనకొండ పోలీస్ స్టేషన్‌లో సీఐ వేణుగోపాల్‌ను కలిశారు.ప్రతి ఏడాది శ్రావణమాసంలో సంప్రదాయబద్ధంగా మారెమ్మ అవ్వకు చల్లధనం, నైవేద్యాలు సమర్పించి బోనాల రూపంలో మొక్కులు తీర్చుకుంటామని గ్రామ పెద్దలు సీఐకు వివరించారు.ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి గొడవలు లేదా అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పల్లెదొడ్డి గ్రామ పెద్దలు, ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కప్పట్రాలలో ఘనంగా ఐజీ ఆకే రవికృష్ణ జన్మదిన వేడుకలు

తలసేమియా బాధితుల కోసం 30 మంది యువత రక్తదానం

పదేళ్లుగా రక్తదానంతో మానవతా సేవలు కొనసాగిస్తున్న కప్పట్రాల యువత







కప్పట్రాల, ఆగస్టు 30 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
కప్పట్రాల గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఐజీ ఆకే రవికృష్ణ ఐపీఎస్ జన్మదిన వేడుకలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశక్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తలసేమియా బాధితుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని దేవనకొండ మండల సీఐ వేణుగోపాల్ ప్రారంభించారు. అనంతరం కప్పట్రాల గ్రామానికి చెందిన 30 మంది యువత రక్తదానం చేశారు. గత పది సంవత్సరాలుగా తలసేమియా బాధితుల కోసం కప్పట్రాల యువత నిరంతరం రక్తదానం చేస్తూ మానవతా సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ కప్పట్రాల గ్రామ అభివృద్ధికి ఆకే రవికృష్ణ ఐపీఎస్ చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్య, మహిళా సాధికారత, రైతుల అభివృద్ధి, యువతకు మార్గనిర్దేశం వంటి రంగాల్లో గ్రామంలో అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు.అనంతరం ఐజీ ఆకే రవికృష్ణతో గ్రామస్తులు వర్చువల్‌గా మాట్లాడి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యువకుడు గిరిబాబు ఐజీ సేవలను వివరిస్తూ ప్రత్యేకంగా రచించిన పాటను విడుదల చేశారు.ఐజీ ఆకే రవికృష్ణ సందేశం
కప్పట్రాల ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత అభివృద్ధి చెందాలనిఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా కొనసాగించాలని కోరారు. త్వరలో కప్పట్రాల గ్రామానికి వచ్చి గ్రామస్తులను కలుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ శ్రీనివాసులు




రేగిగుంట ఆగష్టు 30: (రిపబ్లిక్ న్యూస్)
రేగిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు మరియు సస్పెక్ట్ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్ ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రశాంతమైన వాతావరణం మరియు ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.

ఖనిజ నిక్షేపాలను తొక్కిపెట్టి కార్మికులు,
ఉద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు.

మైనింగ్ పరిరక్షణకు ఉద్యమానికి సిద్ధం.- తల్లెం భరత్ కుమార్ రెడ్డి.





రైల్వే కోడూరు ఆగస్టు 30 రిపబ్లిక్ న్యూస్.
ముగ్గురాయికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన మంగంపేట ఏపీఎండీసీ బైరటీస్ మైనింగ్ విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్రమైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్, డి ఆర్ యు సి సి సభ్యులు, తల్లెం భరత్ కుమార్ రెడ్డి పాత్రికేయుల సమావేశంలో కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు, మంగంపేటలో ఆదివారం అయన మాట్లాడుతూ మంగంపేటలో వేలాది కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు ఫుల్లరీన్ తదితర అత్యంత ఖరీదైన ఖనిజాలు ఉన్నాయని గతంలోనే అనేక పరిశోధనలు స్పష్టం చేశాయని గుర్తుచేశారు. 2005-2008 కాలంలో జిఆర్‌టిసి ద్వారా, ఆపై 2023లో భువనేశ్వర్‌కు చెందిన ' సి ఎస్ ఐ ఆర్, ఐ ఎం ఎం టి సంస్థ ద్వారా, అలాగే ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ సంస్థ ద్వారా వైట్ సేల్, బ్లాక్ సేల్ మినరల్స్‌పై అధ్యయనాలు జరిగినట్లు తెలిపారు. ఏపీఎండీసీ సీపీఓ కూడా ఈ నిక్షేపాలు ఉన్నట్లు గతంలో ధృవీకరించారన్నారు.

అనుమతులు లేకుండా మట్టి పూడ్చివేత
సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం, 2026 జనవరి 1 నుండి మార్చి 31 వరకు కేవలం మూడు నెలల వ్యవధిలోనే 8,73,159 క్యూబిక్ మీటర్ల వ్యర్థ మట్టిని మైనింగ్‌లో పూడ్చివేశారని విమర్శించారు. ఐబీఎం లేదా మైనింగ్ శాఖ ప్లానింగ్ అనుమతులు లేకుండా ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతాన్ని ఇలా మట్టితో పూడ్చడానికి అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించారు
సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుకు భద్రత ఏదని ఆవేదన వ్యక్తం చేశారు,
మంగంపేట మైనింగ్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన 750కి పైగా కుటుంబాల ఉద్యోగులు, వేలాది మంది కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మైనింగ్ 2 లేదా 3 ఏళ్లలో మూతపడుతుందని ప్రచారం చేస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని వాపోయారు. ఇటీవల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కేంద్ర మంత్రులు పర్యటించిన సమయంలో మైనింగ్ దీర్ఘకాలిక నిర్వహణపై స్పష్టమైన ప్రకటన చేస్తారని ఆశించగా,సీఎస్ఆర్ నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామంటూ సాధారణ విషయాలకే పరిమితమయ్యారని విమర్శించారు. సంస్థ మనుగడ కార్మికుల ఉద్యోగుల భద్రత కోసం
పోరాటానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, ఖనిజ నిక్షేపాలపై నిజాయితీగా అధ్యయనం చేసి మైనింగ్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి పూడ్చిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు ప్రాణాలైనా అడ్డుపెట్టి మైనింగ్‌ను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఘనంగా రాజేష్‌అక్షయల వివాహ వేడుక

నూతన వధూవరులకు బాండెడ్ నారాయణ శుభాకాంక్షలు



అనంతపురం సంక్షేమం, ఆగస్టు 30.(రిపబ్లిక్ న్యూస్):రాజేష్‌అక్షయల వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాండెడ్ నారాయణ నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురం నగరంలోని కళాకారుల కాలనీలో ఆదివారం వివాహ వేడుక సందడితో కళకళలాడింది. ఎర్రగుంట్ల/ఒతూరు వారి రాజేష్, అక్షయల వివాహ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఆంజనేయులు, కీర్తిశేషులు అంజనమ్మల స్వగృహంలో ఉదయం 10.30 గంటలకు సంప్రదాయబద్ధంగా వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు.వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వధూవరులు రాజేష్, అక్షయలు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. దీంతో వివాహ ప్రాంగణంలో ఆత్మీయత వాతావరణం నెలకొంది.వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా బాండెడ్ నారాయణ తన మిత్రులతో కలిసి హాజరయ్యారు. నూతన దంపతుల జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు.వివాహ వేడుక అనంతరం బాండెడ్ నారాయణ నూతన వధూవరులకు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. వివాహ కార్యక్రమానికి హాజరైన బంధువులు, మిత్రులు, సన్నిహితులు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

సంగారెడ్డి జిల్లా వట్పల్లి ఎం ఆర్ పి ఎస్ నూతనంగా మండల కమిటీ ఎన్నిక







అందోల్ నియోజకవర్గం

ప్రతినిధి ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్)

అందోల్ నియోజకవర్గం వట్టిపల్లి మండలం ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు గా పెద్ద మాదిగ అశోక్ కుమార్ ఎన్నిక ఇ కార్యక్రమనికి సభఅధ్యక్షులు బుర్రగాళ్ల కుమార్ మాదిగ అధ్యక్షతన వహించారు ముఖ్య అతిథులు గా సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ వి ఎస్ రాజు మాదిగ. సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య మాజీ జిల్లా అధ్యక్షులు మైసగాళ్ల బుచ్చేంద్ర. శ్రీనివాస్ మాదిగ. వీరన్న మాదిగ. నక్క సూర్యకుమార్ మాదిగ. శివనోళ్ల గణపతి మాదిగ తదితరులు పాల్గొన్నారు

రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తల్లి కటకం లక్ష్మి ఈరోజు మరణించింది అంత్యక్రియలు రేపు అని

జగిత్యాల జిల్లా ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షులు ఆడెపు రాజమౌళి





రాయికల్ మండలం ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ మునిసిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తల్లి కటకం లక్ష్మి మరణించింది ఈరోజు సాయంత్రం చనిపోయింది. అంతక్రియలు రేపు జరుగును అని జగిత్యాల జిల్లా ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షులు ఆడెపు రాజమౌళిఈ విషయం తెలుసుకున్న రాయికల్ పట్టణ వాసులు చైర్మన్ ఇంటికి వెళ్లి సంతాపం తెలుపుతున్నారుఈమే మరణం పట్ల చైర్మన్ రవీందర్ వాళ్ళ అన్నయ్య ప్రకాష్ కుటుంబా సభ్యులు పూర్తి శోక సముద్రంలో మునిగిపోయారు ఖద్దం లక్ష్మి మృతి పట్ల రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి మాజీ సింగల్ విండో అధ్యక్షులు గన్నవరం ప్రభాకర్, పడిగల రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు, రాయికల్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, గట్టు వెంకట నరసయ్య, లక్ష్మీ నరసయ్య,(ఏన్ఎల్ జి)రాజనర్సయ్య, రమేష్ నరసయ్య, సురకంటి రాజరెడ్డి, పాలడుగు సుభాష్ రెడ్డి, రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, ఏద్దండి లింగారెడ్డి, మైనార్టీ నాయకులు మహమ్మద్ షంషీర్, ఇంతియాజ్, పాయజ్, సుశీకే శంకర్, దురుశెట్టి రంగయ్య, వెంకటరమణ మెడికల్ అధినేతలు బుడికే గంగన్న,రాజశేఖర్, బత్తిని బాబు గౌడ్ జర్నలిస్టు తెలిపారు

రాఖీ కట్టిన అక్కకి రక్తంతో గాజులు చేయించిన తమ్ముడు తుడుం వంశి కుమార్

ఆందోల్ ప్రతినిధి ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్)





రక్షాబంధన్ అంటే రాఖీ కట్టిన అక్కలకు చెల్లెళ్లకు పెద్దపెద్ద గిఫ్ట్ రూపంలో చీరలు , బంగార ఆభరణాలు, డబ్బుల రూపంలో అక్కాచెల్లెళ్లకు చెల్లిస్తారు . ఇక్కడ మాత్రం ఒక తమ్ముడు తుడుం వంశీ కుమార్ తమ అక్కకి తమ రక్తంతో అక్క కీ గాజులు చేపించాడు . ఈ రోజుల్లో ఆస్తి ఆభరణాలు ఇచ్చే వారిని చూసాం కానీ ఇలా రక్తం పంచుకోని పుట్టిన అక్కకి గాజులు చేపియ్యడం అనేది గొప్ప వరంగా భావించవచ్చు. 2010 టేక్మాల్ నుండి అందోల్ కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన జెల్ల భాగయ్య కీ తమ అక్క జెల్ల అశ్వినికీ వివాహమైంది. .తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక "రాఖీ పౌర్ణమి" (రక్షాబంధన్) హృదయపూర్వక శుభాకాంక్షలు అని అక్క జెల్ల అశ్విని తమ్ముడు వంశీ కుమార్ రాఖీ పండగ తెలిపింది . తోబుట్టువుల మధ్య ప్రేమ, నమ్మకం, జీవితాంతం నిలవాలనే వాగ్దానానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు.కుటుంబంలో మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ బంధాల విలువను చాటిచెప్పే శుభదినం ప్రతి ఇంటా ఆనందాన్ని ఆత్మీయతను నింపాలని ఆశిస్తూ ఈ పవిత్రమైన రాఖీ బంధం పౌరులందరి జీవితాల్లో ప్రేమ, ఐక్యత, ఈ అక్క తమ్ముడు రక్షాబంధన్ కి నిదర్శమని చెప్పవచ్చు.ఇలాంటి రక్తసంబంధం కలకాలం జీవించాలని మీద ప్రేమ అపాయత ఎప్పుడూ భగవంతుడు వీడి పైన ఉంచాలని ఆ దేవుని కోరుకుంటూ అక్క చెల్లెమ్మలందరికీ ఇలాంటి రక్షాబంధన్ పండుగ జరుపుకోవాలని కుటుంబంలో సంతోషం అంటే అక్క చెల్లెమ్మలతోనే సాధ్యమైతుందని తుడుం వంశీ కుమార్ తెలియజేయు తమ బంధంతో తెలియపరిచారు.

బి. ఎల్. ఓ కు S.I.R సర్వే లో సహకారం అందజేసిన సామాజిక కార్యకర్త.



మల్లాపూర్ ఆగష్టు 30 (రిపబ్లిక్ న్యూస్)మల్లాపూర్ మండల కేంద్రంలో ఆదివారం రోజు సెలవును సైతం పక్కన పెట్టి 13 వ వార్డు లో ఓటరు సర్వేలో నోటీసులు వచ్చిన ఓటర్ల ఇంటింటికి వెళ్లి రాధ అనే బి. ఎల్. ఓ. ఓటర్లకు నోటీసులు అందజేసారు. ఈ ప్రక్రియలో ఆమె సోదరుడు అయిన సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తనవంతు సహకారం అందించారు. ప్రతి ఓటరు ఓటు అనవసరంగా తీసివేయడం జరగదని, చిన్న చిన్న తప్పులు ఉండడం వల్లనే నోటీసులు వచ్చాయని, నోటీసు వచ్చినంత మాత్రాన మీ ఓటు తొలగించబడినట్లు అనుకోవద్దని ఓటర్లకు ఉన్న పలు అనుమానాలు నివృత్తి చేసారు. ఈ కార్యక్రమం లో ఇస్లావత్ జీవన్, ఇస్లావత్ తిరుపతి, జటోత్ రాజేష్ మరియు బంజారా తండా ఓటర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి రూపకల్పన, సమష్టి కృషికి నేతలకు రూపన్న పిలుపు.





రైల్వే కోడూరు ఆగస్టు 30 రిపబ్లిక్ న్యూస్.

రైల్వే కోడూరు రాఘవరాజుపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఓబులువారిపల్లి మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరియు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి అయన తనయుడుటి డి పీ యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల పాత్ర, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులపై నాయకులు, కార్యకర్తలతో ముక్కా రూపానందరెడ్డి చర్చించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.



పార్టీ కార్యక్రమాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముక్కా రూపానంద రెడ్డి గారు తెలిపారు. గ్రామాల్లో పార్టీకి సంబంధించిన కార్యకలాపాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రతి కార్యకర్త ప్రజలతో సన్నిహిత సంబంధాలు క్షేత్రస్థాయిలో కొనసాగించాలని నాయకులకు పిలుపునిచ్చారు టిడిపి పార్టీ కుటుంబంలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని బహిరంగ విమర్శలకు దారితీయకుండా నాయకులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు.రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి గ్రామంలో సమన్వయంతో పనిచేయాలని నాయకులకు కార్యకర్తలకు సమిష్టిగా శ్రద్ధ స్థాయి నుంచి పనిచేయాలని



పిలుపునిచ్చారు. నాయకత్వం, కార్యకర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ టీడీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఓబులువారిపల్లి మండలానికి చెందిన ఉమ్మలరాజుపిచ్చిరాజు, ఓబిలి శ్రీధర్ రెడ్డి,పున్నాటి వాసుదేవ రెడ్డి, ఎంపీటీసి గాదెల పనింద్ర, వెంకటేష్ ఆచారి కావుటూరి గజేంద్ర నాయుడు నాగేంద్ర నాయుడు మైనార్టీ నాయకులు షేక్ వల్లి సాహెబ్, అక్బరుద్దీన్ భాష టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనారిటీ నేత మహబూబ్ బాషా కుమారుని పెళ్లికి రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా ఆరూపానంద రెడ్డి, యువనేత సాయి వికాస్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక మండలి విభాగం అధ్యక్షుడు నరసింహ ప్రసాద్, వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు

" చేయూత " తో దివ్యాంగులకు స్వావలంబన

రోటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహణ -ఎల్ ఎన్ 4 ట్రస్ట్ సంయుక్తంగా సేవా కార్యక్రమం









అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 30.(రిపబ్లిక్ న్యూస్):

చేతులు కోల్పోయిన వారికి "చేయూత " అండగా నిలిచింది. దీంతో ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దాదాపు 119 మంది పేదలు, నిరుపేదలు, చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ మెకానికల్ చేతులను అమర్చారు. ఉచితంగా నిర్వహించిన ఈ కార్యక్రమంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

స్వావలంబన సాధించేందుకు దోహదం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3160, అమెరికాకు చెందిన ఎల్ఎన్4 ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్ కన్వీనర్ గా బాధ్యతలు వహించారు. ఈ సందర్భంగాఒక్కో కృత్రిమ మెకానికల్ చేయి విలువ సుమారు 350 అమెరికన్ డాలర్లు కాగా, అర్హులైన వారికి ఉచితంగా అందించారు.ప్రమాదాలు, ఇతర కారణాలతో చేతులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కృత్రిమ చేతులను అమర్చిన అనంతరం వాటి వినియోగంపై లబ్ధిదారులకు అవసరమైన సూచనలు, శిక్షణ అందించారు. రోజువారీ పనులు చేసుకోవడంతో పాటు తమకు సాధ్యమైన ఉపాధి పనులు చేసుకునేందుకు ఈ కృత్రిమ చేతులు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.చేయి కోల్పోవడంతో ఉపాధికి దూరమైన పలువురికి తిరిగి స్వావలంబన సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు కృత్రిమ చేతులను ఉపయోగించి పలు పనులను ప్రయత్నిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈ. మోహన్, రవి వడ్లమాని, కేశవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆత్మవిశ్వాసానికి చేయూత

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు వారు స్వయంగా జీవనం సాగించేలా ప్రోత్సహించడం సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం కావడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం వాలంటీర్లు, రోటరీ క్లబ్‌లు, ఇన్నర్‌వీల్, ఎన్ఎస్ఎస్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, రోటరాక్ట్ సభ్యులు కీలకంగా వ్యవహరించారు. లబ్ధిదారుల నమోదు నుంచి కృత్రిమ చేతుల అమరిక వరకు వివిధ దశల్లో సేవలందించారు. ఒకేసారి దాదాపు 125 మందికి కృత్రిమ చేతులను అమర్చడం ద్వారా ఈ కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంది. చేతులు కోల్పోయిన వారికి శారీరక సహాయంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి "చేయూత" కార్యక్రమం దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

రాయికల్ మండలం పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్ మండలం ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ మండల తాట్లవాయి గ్రామంలో చీటి మంగ రవీందర్ రావు,చిట్యాల కీర్తన గంగాధర్,అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి రాజమ్మ గంగారం లా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్‌వెంట ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేశం, ఉపసర్పంచ్లు నారాయణ, గణేష్, పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డిమాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్, సర్పంచ్ గౌతమి వెంకటేష్ టాక్స్ చైర్మన్ రాజలింగం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు డీసీసీ జిల్లా కార్యదర్శి మొకిద్, మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు స్పందన నాయకులు దుబ్బల వేణు తిరుపతి గౌడ్ తంగెళ్ళ రమేష్ జాను గోపి వేముల సతీష్ భీమరాజు జాగిరి ప్రశాంత్ సుతారి రోజా అనుమల రాజ్ కుమార్ కన్నడ గంగాధర్ అత్తినేని వనిత నాయకులు కోల శ్రీనివాస్, అనుపురం శ్రీనివాస్, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, రాగి శ్రీనివాస్, లావుడ్యా సంతోష్, బొడ్డుపెల్లి రాజశేఖర్, వెంకటేష్ గౌడ్,గంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, గుగ్లావత్ తిరుపతి, రాజేష్, చంద్రశేఖర్ ,మల్లేష్,మల్లేశం, తదితరులు పాల్గొన్నారు ఇదిలా ఉండగా సారంగాపూర్ మండల నాగులూరు గ్రామానికి చెందిన జంగిల్ జల అంజన్న గార్ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగిలి రుసేంద్ర,జంగిలి మహేష్, బీట్ల రమేష్,,ఆకుల తిరుపతి, అత్తినేని శివకుమార్, దేవయ్య, భేతి శంకర్,భూమ్మెనతిరుపతి, రాజన్న, శేఖర్, ఒగ్గు రమేష్, గంగారెడ్డి,ఇత్తడి రమేష్ తదితరులు పాల్గొన్నారు

నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు

ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని



అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి

చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి..

ఘటనా స్థలానికి చేరుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యేకాటసాని



ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు జిల్లాఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది మీదివేములనన్నూర్ గ్రామాల మధ్యలోని నిమ్మకాయ తోటలో వైఎస్ఆర్సిపి కార్యకర్త పిన్నపురం బోయ వెంకటేశ్వర్లు (తండ్రి: మద్దిలేటి) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు,

ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని, మృతికి గల కారణాలను సమగ్రంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని పోలీసు అధికారులను కోరారు.



ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛభారత్

- మహానంది రోడ్డు పక్కనే చెత్తాచెదారం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు



మహానంది, ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)



రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మహానంది పుణ్యక్షేత్రం ఒకటి. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానందికి నిత్యం వేలాది మంది భక్తులతో పాటు న్యాయమూర్తులు, కేంద్ర రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు వస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర కాకుండా దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారు. అంతటి ప్రసిద్ధి చెందిన మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీ వద్ద టోల్ గేట్ కు అతి సమీపంలో ప్రధాన రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోవడం అధికారులు, సిబ్బంది పాలనా తీరుకు అద్దం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల మెరుగు కోసం చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛభారత్ పేరుతో కార్యక్రమాలు చేసే అధికారులకు ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానంది రోడ్డు పక్కనే ఉన్న చెత్త కనిపించడం లేదా అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని భక్తులతో పాటు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సూర్యాపేట,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు

అడ్డుకోబోయిన ఎస్ఐకి తీవ్ర గాయాలు

సూర్యాపేటఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)

సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతోపాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష

అమరావతి,ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సంస్థల సందర్శనలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలు, కొనసాగుతున్న వివిధ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఉన్న వక్ఫ్ సంస్థల సంఖ్య, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు ఇప్పటివరకు సందర్శించిన సంస్థలు, సందర్శనలకు సంబంధించిన ఆధారాలు, ఇంకా సందర్శించాల్సిన సంస్థలు, వాటిని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అలాగే, వివిధ విభాగాల పనితీరు, సమస్యలు, సవాళ్లు, పెండింగ్ అంశాలపై సంబంధిత విభాగాధిపతులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.

వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల



ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన "ప్రాజెక్ట్ అమానహ్" పై చైర్మన్ ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడీ కేటాయించి, ఆస్తి వివరాలు, భౌతిక స్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసాలు తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి, ధృవీకరించిన డిజిటల్ రికార్డుగా రూపొందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ముందు 7 రోజుల పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించనున్నారు. ఇందులో ఫీల్డ్ డేటా సేకరణ, ఫారమ్ వినియోగం, డేటా నాణ్యత, రిస్క్ గుర్తింపు, యాక్షన్ ట్రాకింగ్, జిల్లా స్థాయి డ్యాష్‌బోర్డ్ వంటి అంశాలను పరీక్షించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని చైర్మన్ సిబ్బందికి సూచించారు. ప్రతి విభాగం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ యాఖూబ్ ఖాజీ, డీఈఈ అబ్దుల్ ఖాదర్, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, సెక్షన్ హెడ్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కేపీ పాల్ తో పోల్చిన బొత్స

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు."విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేపీ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే.చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి వాటి కోసం కాదు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు

అక్రమ మద్యం స్వాధీనం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన





నంద్యాల క్రైం, ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు నేర నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు ఆయా సబ్ డివిజనల్ పోలీస్ అధికారుల సూచనలతో క్రింద తెలిపిన నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, నాటు సారాయి, బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు.నందికొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నందికొట్కూరు పోలీస్ స్టేషన్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి షికారిపేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 20 నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 40 లీటర్ల బెల్లం మూటను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి ముసలిమడుగు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నారు. మిడ్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మిడ్తూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కలమందలపాడు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నారు. కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని కోయిలకుంట్ల సీఐ ఆధ్వర్యంలో మండలంలోని అమడాల గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు రేవనూరు, కోయిలకుంట్ల, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 40 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పై నాలుగు ప్రాంతాలలో గ్రామ ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించి, మాదకద్రవ్యాలు మరియు అక్రమ మద్యం వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండటం, బాల్య వివాహాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, శక్తి యాప్, డయల్-100/112 తదితర ప్రజా భద్రత అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఏ.కోడూరు దళిత కాలనీలో నిరసన



బండి ఆత్మకూరు, ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలం, ఏ.కోడూరు గ్రామంలోనీ దళిత కాలనీలో ఆర్ఓఆర్ ప్లాంట్ వద్ద త్రాగునీటి కోసం కాలనీ వాసులు నిరసన చేపట్టారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ ఆధ్వర్యంలో కాలనీ ఈ నిరసన జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఏ.కోడూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్ఓఆర్ ప్లాంట్ వారం రోజులు గా పనిచేయడం లేదన్నారు. ఆర్ఓఆర్ ప్లాంట్ కు ఉన్న కాయిన్ బాక్స్ అందుబాటులో లేకపోవడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం పై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డేవిడ్, మండల నాయకులు కుళాయి స్వామి పంచాయతీ సెక్రెటరీకి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. దీంతో ఆయన ట్రాన్స్ఫార్మర్ లోడ్ ఎక్కువైతుందని స్టెబిలైజర్ పనిచేయడం లేదని తెలియజేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే ఆర్వో ప్లాంట్ కు మరమ్మత్తులు చేయించి కాలనీవాసులకు వెంటనే మినరల్ వాటర్ అందజేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నరసింహులు, నారాయణ, వెంకటస్వామి, జాన్, సాల్మన్, పుష్పరాజ్, నీలమ్మ, అజయ్, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్బారాయుడు ఆలయ అభివృద్ధికి 1.10 లక్ష విరాళం.

ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.



పాణ్యం ప్రతినిధి ఆగస్టు.30(ప్రజా రిపబ్లిక్ న్యూస్). ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం ఒక లక్ష పది వేలు రూపాయలు ఆదివారం భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణముకు చెందిన ఫణీంద్ర శర్మ వారి మనవడు షణ్ముఖ ధ్రువ అనే భక్తుడు జన్మదినము ను పురస్కరించుకొని శ్రీ స్వామివారి ఇంటి ఇలవేల్పు కావడంతో ఒక లక్ష రూపాయల చెక్ ను ఆలయ అధికారికి అందజేశారు. అదేవిధంగా కర్నూలు పట్టణమునకు చెందిన శ్రీకాంత్ సిస్తు, సాహిత్య అనే భక్తులు పది వేలు విరాళంగా ఆన్లైన్ ద్వారా విరాళంగా సమర్పించారని వారికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు

స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు ఆదేశాలు



నంద్యాల క్రైం, ఆగస్టు 30, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలో నీట్ పీజీ 2026 కు సంబంధించి 04 పరీక్ష కేంద్రాలలో 770 అభ్యర్థులు హాజరయ్యే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 9:00 గంటలకు పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజ్, రామకృష్ణ పిజి కాలేజ్, ఆర్.జి.ఏం.ఇంజనీరింగ్ కాలేజ్ , శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష నిర్వహించడానికి ముందు రోజు నుండే 24/7 బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది. కేంద్ర అధికారులు, టిసిఎస్ ప్రతినిధులతో సమన్వయం చేసుకునే పరీక్షా కేంద్రాలలోకి 8:30 గంటల లోపే అనుమతించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి ముందుగా ప్రిస్కింగ్ మరియు స్క్రీనింగ్ చేసి పరీక్షా కేంద్రంలో పలికి అనుమతించడం జరిగింది. పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్, ఇయర్ పీస్ లు, ఏఐ గ్లాస్సెస్, చిన్న కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలతో సహా అన్ని నిషేధిత పరికరాలను అనుమతించకుండా స్క్రీనింగ్ చేయడంతో పాటు పరీక్షా ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరిగింది. పరీక్ష కేంద్రాలలో మొబైల్ సిగ్నల్ పనిచేయకుండా జామర్సన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఉన్నతాధికారితో పాటు సరిపడా సిబ్బందిని నియమించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను నియమించి, ఎక్కడా



అభ్యర్థులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరిగింది. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో డ్రోన్ పెట్రోలింగ్ తో పాటు సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్ బృందాల ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ నిర్వహించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనంలో అలరించిన నంద్యాల కవులు



నంద్యాల ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్) :తెలుగు భాషా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కర్నూలులోని టి.జి.వి. కళాక్షేత్రంలో ఆదివారం నాడు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి 'శతాధిక కవి సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన కవులు తమ కవితా గానంతో సభను విశేషంగా ఆకట్టుకున్నారు.నంద్యాలకు చెందిన ప్రముఖ కవులు టి.వి. సురేష్ బాబు, కొప్పుల ప్రసాద్, నాగ కుమార్, ఎం.ఎన్.డి. రఫీ, చిలకల బాలరాజు, మరియు రత్నలక్ష్మి ఈ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని మాతృభాషా విశిష్టత, తీపిదనం మరియు సాహితీ వికాసంపై స్వీయ కవితలను చదివి ఆహుతులను అలరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, టి.జి.వి. కళాక్షేత్ర చైర్మన్ టి.జి. వెంకటేష్, కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్, ప్రముఖులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా ముఖ్య అతిథులుగా హాజరై కవులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. తెలుగు భాషా రక్షణకు, సాహిత్య పోషణకు కవులు చేస్తున్న కృషి అభినందనీయమని అతిథులు కొనియాడారు.జిల్లా స్థాయిలో నంద్యాల ఖ్యాతిని చాటిచెప్పిన కవులను నంద్యాల పుర ప్రముఖులు, సాహితీవేత్తలు మరియు అభిమానులు హృదయపూర్వకంగా అభినందించారు.

నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ

- ఏడు మందికి 56 వేల వ్యయంతో మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ. ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్, విజువల్లీ చాలెంజ్డ్ పుల్లయ్య సౌజన్యంతో

-. దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున పుల్లయ్యను ఘనంగా సత్కరించిన డాక్టర్ రవి కృష్ణ ,ఎం.పీ.వి. రమణయ్య



నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ పుల్లయ్య సౌజన్యంతో ఏడు మందికి మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేసిన సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య తదితరులు.

నంద్యాల ఆగస్టు 30 (రిపబ్లిక్ న్యూస్) :

ఆదివారం నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య అధ్యక్షతన జరిగిన సేవా కార్యక్రమంలో, సంఘం గౌరవ అధ్యక్షులు, అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న పుల్లయ్య సౌజన్యంతో ఏడు మంది దివ్యాంగులకు 56 వేల రూపాయలతో కొనుగోలు చేసిన మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య మాట్లాడుతూ పుల్లయ్య అంధత్వాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో స్టేట్ బ్యాంకులో ఉద్యోగం సాధించడమే కాకుండా తిరిగి దివ్యాంగులకు సహకరించాలని ముందుకు వచ్చి 56 వేల విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం దివ్యాంగుల సంక్షేమానికి కృషిని నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందజేయడం, ప్రతినెల అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్యను



మూడు చక్రాల సైకిళ్లు 7 విరాళంగా ఇచ్చిన పుల్లయ్యను సత్కరిస్తున్న డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య తదితరులు.

ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ,రమణయ్య లతో పాటు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు వెంకటరావు, కార్యవర్గ సభ్యుడు మురళీధర్, సంఘం కార్యాలయ కార్యదర్శి ఆలా మధు, సలహాదారు శివరామిరెడ్డి,లబ్ధిదారుల బంధువులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ న్యూస్ కథనానికి స్పందన

రోడ్లు మరమ్మత్తు పనులు చేపట్టిన సర్పంచ్ తీట్ల లహరి రాజేష్.



మల్లాపూర్ ఆగష్టు 30 (రిపబ్లిక్ న్యూస్)

రేగుంట గ్రామంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ ఆధ్వర్యంలో ఐదవ వార్డు మెంబరు మహమ్మద్ బషీర్ ఆదివారం మట్టితో పూడ్చి మరమ్మతులు చేశారు. గుంతలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడటంతో గమనించిన మహమ్మద్ బషీర్ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సర్పంచ్ మట్టితో గుంతలను పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ మాట్లాడుతూ గుంతల రోడ్డు వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో తాత్కలికంగా మరమ్మతు చర్యలు చేపట్టినట్లు తెలిపారు



ప్రజా రిపబ్లిక్
www.prajarepublic.com
10 Aug 2026 - Page 7

అధ్వాన్నంగా రోడ్లు అవస్థలు పడుతున్న ప్రజలు

మల్లాపూర్ ఆగష్టు 9 (రిపబ్లిక్ న్యూస్)
మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలోని ఐదు మరియు ఆరవ వార్డు ప్రధాన రహదారి పైన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షాలకే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వాకీదార్ క్వార్టర్స్ నుండి హనసయ్య మేన్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైందని స్థానికులు వాపోయారు. పూర్తిగా గుంతలమయంగా మారిన రోడ్డుపై కాలినడకన వెళ్లే ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. తమ గ్రామంలోని రహదారులకు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్థులు

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com